కూటమిలో జోష్

- జగన్ పాలనకు జనం బైబై
- కూటమిదే అధికారమంటూ ఎగ్జిట్‌పోల్స్‌లో మెజార్టీ సర్వేల అంచనా
- కడప జిల్లా ఫలితాలపై కేకే సర్వే.. అంచనాలు.. సంచలనం
- ఉమ్మడి జిల్లాలో వైసీపీకి పులివెందుల, బద్వేలు, రాయచోటి మాత్రమే
- కడప ఎంపీ సహా మిగతా అన్ని స్థానాలు కూటమివే
- జమ్మలమడుగులో బీజేపీ, కోడూరులో జనసేన అంటూ ఎగ్జిల్‌పోల్స్ వెల్లడి
- ఫలితాలకు ముందే కూటమిలో ఉత్సాహం
- వైసీపీలో నైరాశ్యం

అందరూ ఎప్పుడెప్పుడా అంటూ ఎదురుచూసిన ఎగ్జిట్ పోల్స్ శనివారం సాయంత్రం 6.30గంటల తరువాత వెలువడ్డాయి. వివిధ సర్వే, మీడియా సంస్థలు ఎగ్జిట్‌పోల్స్ వివరాలను ప్రకటించాయి. అయితే అందరూ ఊహించినట్లుగానే మెజార్టీ సర్వే సంస్థలు రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమిదే అధికారమని తేల్చేశాయి. ఇక వైసీపీ అనుకూల మీడియా, వైసీపీకి అనుకూలంగా ఇస్తారంటూ సోషల్‌మీడియాలో ప్రచారం జరిగిన సంస్థలు మాత్రం వైసీపీదే విజయమంటూ ప్రకటించాయి. అయితే మెజార్టీ ఎగ్జిట్‌పోల్స్ అన్నీ కూటమికే పట్టం కట్టడంతో ఫలితాలకు ముందే ఎన్‌డీఏ కూటమిలో నయాజోష్ నెలకొంది. సర్వేలు వచ్చిన తరువాత వైసీపీ శ్రేణులు డీలా పడ్డాయి.

(కడప-ఆంధ్రజ్యోతి): వై నాట్ 175 అంటూ గొప్పలు పోయిన జగన్ అండ్ కోకు ఎగ్జిట్ పోల్స్ దిమ్మతిరిగే షాక్ ఇచ్చాయంటారు. ఇక కేకే సర్వే సంస్థ అయితే ఉమ్మడి జిల్లాలో పులివెందుల, బద్వేలు, రాయచోటి మాత్రమే వైసీపీ ఖాతాలో వేయగా, మిగతా ఏడు అసెంబ్లీ, రెండు పార్లమెంటు స్థానాలను టీడీపీ, బీజేపీ ఖాతాలో వేసి వైసీపీ శ్రేణులకు షాక్ ఇచ్చింది. కౌంటింగ్‌కు రెండు రోజుల ముందు ప్రకటించే ఎగ్జిట్‌పోల్స్ కోసం జనం ఆతృతగా ఎదురు చూస్తూ వచ్చారు. మెజార్టీ సంస్థలు జనం నాడిని పసిగట్టి కూటమిదే అధికారమంటూ తేల్చేశాయి. ఈసారి సార్వత్రిక ఎన్నికలు కూడా హోరాహోరీగా సాగాయి. అన్ని నియోజకవర్గాల్లో నువ్వా నేన్నా అన్నట్లుగా ఉన్నాయి. పోల్ మేనేజ్‌మెంటులో ఒకటి రెండుచోట్ల మినహాయిస్తే ఇరుపార్టీలు పోటాపోటీగా చేసుకున్నారు. అందుకే ఈసారి కడప జిల్లాలో వార్ వన్ సైడ్ కాదంటూ ఎగ్జిట్ పోల్స్‌లో కూడా తేలిపోయింది.

కేకే సర్వే సంచలనం

కేకే సంస్థ తన ఎగ్జిట్‌పోల్స్‌లో ఉమ్మడి కడప జిల్లా ఫలితాలపై సంచలన అంచనాలను వెలువరించింది. స్టేట్ లో మిగతా చోట్ల ఫలితాలు ఎలా ఉన్నా కడపలో వైసీపీకి అనుకూలంగా ఉంటాయనుకున్నారు. అయితే కేకే సర్వే మాత్రం ఉమ్మడి కడప జిల్లాలోనే కేవలం వైసీపీకి సీఎం జగన్ ప్రాతినిధ్యం వహిస్తున్న పులివెందుల, బద్వేలు, రాయచోటిలో మాత్రమే గెలుస్తుందని తేల్చింది. ఇక కడప పార్లమెంటు టీడీపీ గెలుస్తుండగా, కడప అసెంబ్లీ, కమలాపురం, మైదుకూరు, ప్రొద్దుటూరు రాజంపేటలో టీడీపీ గెలుస్తుందని ప్రకటించింది. రాజంపేట పార్లమెంటు, జమ్మలమడుగు అసెంబ్లీ స్థానాలను బీజేపీ, రైల్వేకోడూరు అసెంబ్లీని జనసేన గెలుచుకుంటుందని తేల్చింది. కేకే సర్వేప్రకారం ఉమ్మడి జిల్లాలో తొలిసారిగా బీజేపీ జమ్మలమడుగు, రాజంపేట పార్లమెంటులో గెలుస్తుండగా జనసేన రైల్వేకోడూరులో సత్తా చాటనున్నాయి.

జిల్లాలో టీడీపీకి పూర్వవైభవం

ఉమ్మడి కడప జిల్లా 2004 ఎన్నికల ముందు వరకు టీడీపీకి కంచుకోటగా ఉండేది. 2004 తరువాత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎం కావడంతో రాజకీయ పరిస్థితులు మారాయి. వైఎస్ మరణం, రాష్ట్ర విభజన, వైసీపీ ఏర్పాటు నేపథ్యంలో.. జిల్లా ప్రజలు వైఎస్ కొడుకు జగన్‌కు జై కొట్టారు. 2019 ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో వైసీపీ 10 అసెంబ్లీ, రెండు పార్లమెంటు స్థానాలను కైవసం చేసుకుంది. అయితే.. తాజాగా వెలువరించిన కేకే ఎగ్జిట్‌పోల్స్ వాస్తవం అయితే ఈ ఎన్నికలతో మళ్లీ టీడీపీకి పూర్వవైభవం వచ్చినట్లే. ఇక ఎగ్జిల్‌పోల్స్ ఫలితాలు చూసి టీడీపీ శ్రేణులు సంతోషంలో మునిగితేలుతున్నారు. వైసీపీ శ్రేణులు నిరాశలో ఉన్నారు.

ఎగ్జిట్‌పోల్స్ కాదు.. కౌంటింగ్‌రోజున అసలు ఫలితాలు వస్తాయంటూ వైసీపీ నేతలు చెప్పుకోవడాన్ని కేడర్ నమ్మడంలేదు. మెజార్టీ సర్వేలు కూటమికే పట్టం గడుతున్నాయి. అయితే మళ్లీ మనదే అధికారం అంటూ వైసీపీ చెబుతుండటాన్ని కొందరు వైసీపీ కార్యకర్తలే నమ్మడంలేదు.



టీవీలకు అతుక్కుపోయిన జనం

ఇక మే13న పోలింగ్ ముగిసింది. అప్పటి నుంచి గెలుపు మాదే అంటే మాదేనంటూ ఇరుపార్టీలు మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తూ వచ్చాయి. ఇక పోలింగ్ బూత్‌ల వారీగా లెక్కలు వేసుకుంటూ, సర్వేలు చేయిస్తూ, ప్రత్యేక టీంతో ఓటరు నాడి తెలుసుకునేందుకు ప్రయత్నాలు చేశారు. అయినప్పటికీ పోలింగ్‌కు ముందు వచ్చే ఎగ్జిట్‌పోల్స్ కోసం ఎప్పుడెప్పుడా అంటూ ఎదురు చూస్తూ వచ్చారు. తుది ఫలితం 4న రానుంది. అయినప్పటికీ ఈసారి ఎన్నడూ లేనివిధంగా ఎగ్జిట్‌పోల్స్ ఫలితం కోసం సాయంత్రం 4.30 గంటల నుంచే జనం టీవీలకు అతుక్కుపోయారు. ఈసీ నిబంధనల ప్రకారం సాయంత్రం 6.30 తరువాత ఎగ్జిట్‌పోల్స్ వెలువడ్డాయి. గాలి, కొన్ని చోట్ల వర్షం కురవడంతో కొన్ని చోట్ల కరెంటు పోయినప్పటికీ.. మొబైల్స్‌లో ఎగ్జిట్‌పోల్స్ ఫలితాలు చూశారు. మెజార్టీ సర్వే సంస్థలు కూటమిదే విజయమని టీవీల్లో చెబుతుంటే వైసీపీ అనుకూల మీడియా మాత్రం వారికి అనుకూలంగా ఇచ్చిన సర్వేలనే పదే పదే చూపిస్తూ వచ్చింది. దీనిని వైసీపీ వర్గాలే నమ్మకపోవడం విశేషం.

ముగిసిన హనుమాన్ జయంతి ఉత్సవాలు



చక్రాయపేట, జూన్ 1: గండి క్షేత్రంలో జరుగుతున్న హనుమాన్ జయంతి ఉత్సవాలు శనివారం మహా పూర్ణాహుతితో ఘనంగా ముగిశాయి. ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి, ఛైర్మన్ కావలి కృష్ణతేజల ఆధ్వర్యంలో అర్చకులు, వేద పండితులు త్రికాల ఆరాధన, పంచసూక్త హోమం, మన్యసూక్త హోమం, ఆంజనేయస్వామి మూలమంత్ర హోమం, సుదర్శన హోమం, మహాపూర్ణాహుతి, మహాసంప్రోక్షణ, గోష్టి నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందించారు. ఉత్సవాల సందర్భంగా భక్తుల కోసం దేవస్థానంలో చలువ పందిళ్లు వేసి విద్యుత్ అలంకరణ చేశారు.

కిటకిటలాడిన గండి క్షేత్రం

హనుమాన్ జయంతి సందర్భంగా శనివారం గండి క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. ఎన్నడూలేని విధంగా ఈ ఏడాది ఉత్సవాలకు భక్తులు పెద్దసంఖ్యలో తరలి రావడం విశేషం. భారీగా భక్తులు పాల్గొనడంతో దేవాలయం కళకళలాడింది. ఉదయం 6గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు క్యూలు కిక్కిరిసిపోయాయి. దర్శనానికి దాదాపు మూడు గంటల సమయం పట్టింది. ఛైర్మన్ కృష్ణతేజ భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేశారు. వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదాన కార్యక్రమాలు, లడ్డు ప్రసాదాలు అందజేశారు.



విలేకరులతో మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి



ఎమ్మెల్యే సోదరుడితో శాంతిభద్రతలకు విఘాతం

- ఆ రోజే చర్యలు తీసుకుని ఉండాల్సింది
- జిల్లా యంత్రాంగం నిష్పక్షపాతంగా వ్యవహరించాలి
- సామాన్యులను జిల్లా బహిష్కరణ, హౌస్ అరెస్టు చేయడం సరికాదు
- టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 1: శాంతిభద్రతల విఘాతానికి సృష్టికర్త కడప ఎమ్మెల్యే సోదరుడే అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. ఆయనపై ఆ రోజే చర్యలు తీసుకుని ఉండాల్సిందని తెలిపారు. జిల్లా యంత్రాంగం నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్నారు. సామాన్యులను జిల్లా బహిష్కరణ, హౌస్ అరెస్టులు చేయడం సరికాదన్నారు. శనివారం కడప నగరంలోని తమ నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పోలీసుస్టేషన్ వద్ద ఎమ్మెల్యే తమ్ముడు అహ్మద్‌బాషా నోటికొచ్చినట్లు బూతు పదాలు మాట్లాడి దాడి చేసినప్పుడే జిల్లా బహిష్కరణ చేసి ఉంటే కడపలో ఈ ఘర్షణ వాతావరణం ఉండేది కాదన్నారు. పోలింగ్‌రోజు ఘర్షణలకు ఎమ్మెల్యే అంజద్ బాషా, ఆయన తమ్ముడు అహ్మద్‌బాషా, అల్లుడు కారణమన్నారు. ఎమ్మెల్యే, ఆయన తమ్ముడు ఒకే ఇంట్లో ఉంటూ ఒకరు వైసీపీ ఎమ్మెల్యేగా, మరొకరు ఇండిపెండెంట్‌గా పోటీ చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఇలాంటి వారికి పాసులు ఇవ్వడం సరికాదన్నారు. ఎన్నికల రోజు పోలీసులు తీసుకోవలసిన జాగ్రత్తలు విస్మరించి కౌంటింగ్ రోజున హడావుడి చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గృహ నిర్బంధాలు, జిల్లా బహిష్కరణలు కొత్తగా చూస్తున్నామని అన్నారు. అన్ని పార్టీలను కలెక్టరు, ఎస్పీ సమానంగా చూడాలని కోరారు. టీడీపీ వారిని మాత్రమే గృహ నిర్బంధం, జిల్లా బహిష్కరణ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఎటువంటి రూల్స్ లేవు అని మాట్లాడిన వైసీపీ నాయకులు, సజ్జలపై ఎలక్షన్ కమిషన్ కేసు పెట్టిందన్నారు. ఇప్పటికీ వైసీపీ నాయకులకు వత్తాసు పలికే పోలీసులు ఉన్నారని టీడీపీ అధికారంలోకి రాగానే ఇలాంటి వారిపై చర్యలు ఉంటాయని తెలిపారు. టీడీపీ ఏజెంటు ద్విచక్ర వాహనాన్ని కాల్చారని దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధనరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ సీఎంగా ఉన్నప్పుడు ఇలాంటి పరిస్థితి కడపలో లేదన్నారు. పోలీసు 30 యాక్టు 144 సెక్షన్, బహిష్కరణలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు రాంప్రసాద్, జయరాం, రామాంజి, సునీత పాల్గొన్నారు.

రూ.1.5కోట్ల నగదు పట్టివేత

సికెదిన్నె, జూన్ 1: ఓ వ్యాపారి కారులో తరలిస్తున్న రూ.1.5 కోట్ల నగదును పట్టుకున్నట్లు చింతకొమ్మదిన్నె సీఐ శివశంకర్‌నాయక్ తెలిపారు. ప్రొద్దుటూరుకు చెందిన బంగారు వ్యాపారి సోము తిరుమలయ్య ఏపీ04. బివై6233 నంబరు కారులో భారీమొత్తంలో డబ్బు తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో చెక్‌పోస్టు వద్ద ఆపి తనిఖీలు చేయడంతో డబ్బు పట్టుబడిందన్నారు. దీనికి ఎటువంటి బిల్లులు లేకపోవడంతో నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ నగదును తిరుపతిలో స్థలం కొనుగోలుకు తీసుకు వెళుతున్నట్లు వ్యాపారి తెలిపారని, అయితే అందుకు సంబంధించి ఆధారాలు లేకపోవడంతో నగదును సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు.

ప్రశాంత కౌంటింగ్‌కు సహకరించాలి

- ఏజెంట్లు క్రమశిక్షణతో ఉండాలి
- అల్లర్లు సృష్టిస్తే చట్టపరమైన చర్యలు
- ఎగ్జిట్ పోల్స్‌పై సంయమనం పాటించాలి
- రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్

కడప(కలెక్టరేట్), మే 1: కౌంటింగ్ సజావుగా, ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు అభ్యర్థులు, ఎన్నికల ఏజెంట్లకు సూచించారు. సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సమయంలో పాటించవలసిన నిబంధనలపై శనివారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో నగరపాలక కమిషనర్ ప్రవీణ్‌చంద్, డీఆర్వో గంగాధర్‌గౌడ్‌తో కలసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కడప రిమ్స్ సమీపంలోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్శిటీ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రంలో సీసీ కెమెరాల నిఘాలో ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. ఎన్నికల ప్రక్రియలో చివరి ఘట్టం అయిన ఓట్ల లెక్కింపు 4వ తేదీన పారదర్శకంగా, శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని రకాల భద్రతా చర్యలు చేపట్టామన్నారు. కౌంటింగ్ కేంద్రంలో చేస్తున్న ఏర్పాట్లు, కౌంటింగ్ హాలులో పాటించాల్సిన నియమాలు, చెయ్యకూడని పనులు, పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు విధానం, కౌంటింగ్ ఏజెంట్లుగా ఎవరిని నిమించాలి? ఎంతమందిని నియమించాలి? వాహనాల పార్కింగ్, మీడియా ఫెసిలిటేషన్ సెంటర్, సెక్యూరిటీ తదితర అంశాలపై ప్రజా ప్రతినిధులు, ఏజెంట్లకు వివరించారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమన్నారు. కౌంటింగ్ కేంద్రంలో క్రమశిక్షణతో ఉండాలన్నారు. కౌంటింగ్ కేంద్రంలో సందేహాలొస్తే వెంటనే రిటర్నింగ్ అధికారి దృష్టికి తీసుకెళ్లాలన్నారు. అల్లర్లు సృష్టిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ఇప్పటికే కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ చేపడుతున్నామని, 4వ తేదీన ఉదయం 5 గంటలకు 3వ ర్యాండమైజేషన్ పూర్తవుతుందన్నారు. కౌంటింగ్ పూర్తయ్యేంత వరకు లోపలికి వచ్చిన వారు బయటకు వెళ్లడానికి అనుమతి లేదన్నారు. 4న ఉదయం 6 గంటలకు స్ట్రాంగ్ రూం తలుపులు తెరుస్తారని, 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ల ఓట్ల లెక్కింపు, 8-30 గంటలకు ఈవీఎంల ఓట్ల లెక్కింపు ప్రారంభం అవుతుందన్నారు. కౌంటింగ్ కేంద్రంలోకి మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదన్నారు.

భద్రతా చర్యల్లో భాగంగా 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. 4వ తేదీ నుంచి 6 వరకు ముందస్తు బైండోవర్, కేసులు, జిల్లా బహిష్కరణ, గృహ నిర్బంధం వంటి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎగ్జిట్ పోల్స్‌పై అన్ని రాజకీయ పార్టీలు సంయమనం పాటించాలన్నారు.

185 మంది పోలింగ్ సిబ్బందికి రెండు ఇంక్రిమెంట్లు కట్

- కలెక్టర్ విజయరామ రాజు

కడప (ఎడ్యుకేషన్), జూన్ 1: ఎన్నికల విధుల్లో అలసత్వం వహించిన 185 మంది పోలింగ్ సిబ్బందికి రెండు ఇంక్రిమెంట్లు నిలుపుదల చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎన్నికల విధులు కేటాయించిన సిబ్బందిలో 185 మంది మే 12, 13 తేదీల్లో పోలింగ్ విధుల్లో నిర్లక్ష్యం, అలసత్వం వహించి ఎన్నికల ప్రక్రియ ఆలస్యానికి కారకులయ్యారని తెలిపారు. దీంతో ప్రజాప్రాతినిధ్య చట్టం 1951 సెక్షన్ 134 ప్రకారం వీరందరికీ రెండు ఇంక్రిమెంట్లు నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించి సిబ్బంది అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

మూడంచెల భద్రతతో కౌంటింగ్ ఏర్పాట్లు

కడప (క్రైం), జూన్ 1: పటిష్టమైన మూడంచెల భద్రతతో కౌంటింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామ రాజు పేర్కొన్నారు. సోమవారం కడప రిమ్స్ సమీపంలోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్శిటీలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్, జేసీ గణేశ్‌కుమార్, నగర కమిషనర్ ప్రవీణ్‌చంద్‌తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. కౌంటింగ్ కేంద్రంలో నియోజకవర్గ కౌంటింగ్ టేబుళ్లు, వాహనాల పార్కింగ్, కమ్యూనికేషన్ రూము, మీడియా కేంద్రం, సూచిక బోర్డుల ఏర్పాటు, కౌంటింగ్ హాలులోకి ప్రవేశించేందుకు అధికారులు, సిబ్బంది, ఏజెంట్లకు విడివిడిగా బార్‌కోడింగ్ ఏర్పాటు తదితరాలను కలెక్టర్ పరిశీలించి సంబంధిత నోడల్ అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. కౌంటింగ్ హాలులో ఏ చిన్నపాటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు.

ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సుధాకర్, అడిషనల్ ఎస్పీ కృష్ణారావు, కడప రిటర్నింగ్ అధికారి మధుసూదన్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.



సాధారణ విషయాన్ని రాజకీయం చేయొద్దు

అసత్య ప్రచారాలు చేయడం మంచి పద్ధతి కాదు : ఏఎస్పీ సుధాకర్


మాట్లాడుతున్న కడప ఏఎస్పీ సుధాకర్

కడప (క్రైం), జూన్ 1 : కడప చిన్నచౌకు పోలీసుస్టేషన్ పరిధిలోని శంకరాపురంలో రాత్రి సమయంలో కాలిన ద్విచక్ర వాహన ఘటనలో బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని, దీనిపై అసత్య ప్రచారాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏఎస్పీ అడ్మిన్ లోసారి సుధాకర్ హెచ్చరించారు. కడప చిన్నచౌకు పోలీసుస్టేషన్‌లో శనివారం ఆయన డీఎస్పీ ఎండీ షరీఫ్, చిన్నచౌకు సీఐ నరసింహారెడ్డితో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జూన్ 1న తెల్లవారుజామున 2 గంటల సమయంలో కడప నగరం శంకరాపురంలోని కొత్త రామాలయంవీధిలో నివాసం ఉంటున్న సిరికిరెడ్డి ప్రసాద్‌రెడ్డి అనే వ్యక్తికి చెందిన ఏపీ 04 ఏహెచ్ 2575 నెంబరు గల ద్విచక్ర వాహనం తన ఇంటి బయట పార్కింగ్ చేసి ఉండగా కాలిపోయిందన్నారు. ఈ విషయంపై ప్రసాద్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మోటారు సైకిలు ప్రమాదవశాత్తు తగలబడిందా లేక ఎవరైనా కక్షపూరితంగా తగలబెట్టారా అన్న విషయంపై సీసీ కెమెరాల పరిశీలన జరుగుతోందన్నారు. దీనిపై అన్నికోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. నిందితులను గుర్తించిన వెంటనే వారిని జైలుకు పంపడం తథ్యమన్నారు. ఈ ఘటన వెనుక ఎటువంటి రాజకీయ కోణం లేదన్నారు. పూర్తి సమాచారం తెలియకుండా అనవసరంగా సోషల్ మీడియాలో రంగుపులిమి దుష్ప్రచారం చేస్తే కారకులు కూడా బాధ్యులు కావాల్సి వస్తుందని హెచ్చరించారు.

స్కూటరుకు నిప్పంటించిన దుండగులు

పరిశీలించిన కడప టీడీపీ నేతలు


ద్విచక్ర వాహనాన్ని పరిశీలిస్తున్న శ్రీనివాసరెడ్డి, మాధవీరెడ్డి

కడప (క్రైం), జూన్ 1 : కడప నగరంలోని శంకరాపురంలో టీడీపీ అభ్యర్థి మాధవీరెడ్డి తరఫున బూత్ ఏజెంటుగా వ్యవహరించిన సిగిలి ప్రసాద్‌రెడ్డికి చెందిన ద్విచక్ర వాహనానికి గుర్తు తెలియని దుండగులు నిప్పంటించారు. వాహనం పూర్తిగా కాలిపోయింది. విషయం తెలుసుకున్న టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, కడప నియోజకవర్గ అభ్యర్థి ఆర్.మాధవీరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని ఆ వాహనాన్ని పరిశీలించారు. టీడీపీ ఏజెంటు సగిలి ప్రసాద్‌రెడ్డిని విషయం అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెచ్చగొట్టే చర్యలు మానుకోవాలన్నారు. ఈ విషయంపై పోలీసులు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్ని రెచ్చగొట్టే చర్యలు చేసినా మేము, మా కార్యకర్తలు శాంతియుతంగా ఉంటామన్నారు. ఈ మేరకు చిన్నచౌకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కాగా బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇంక్రిమెంట్లు నిలిపివేయాలనుకోవడం అన్యాయం

యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా


సూపరింటెండెంట్‌కు వినతిపత్రం ఇస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 1 : సార్వత్రిక ఎన్నికల్లో పాల్గొనని ఉపాధ్యాయులకు ఇంక్రిమెంట్లలో కోత పెట్టాలనుకోవడం అన్యాయమని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి మహేశ్‌బాబు తెలిపారు. శనివారం కడప నగరం ఆర్‌జేడీ కార్యాలయంలో సూపరింటెండెంట్ సురేష్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికలు సజావుగా జరగడానికి ఉపాధ్యాయులంతా సమష్టిగా పనిచేశారని, దీనిని అధికారులు గుర్తించాలన్నారు. గతంలో జరిగిన అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల కంటే ఈ ఎన్నికలు ఎలాంటి ఆటంకాలు లేకుండా సజావుగా నిర్వహించిన ఉపాధ్యాయులకు రెమ్యునరేషన్ కూడా రకరకాలుగా చెల్లించారన్నారు. ఉపాధ్యాయులకు చెల్లించిన రెమ్యునరేషన్ తేడాపై అధికారులు స్పందించలేదన్నారు. ఎన్నికల విధులకు హాజరు కాలేకపోయిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తమ ఆరోగ్య సమస్యలపై ఇంట్లో తల్లిదండ్రులు ఆరోగ్య పరిస్థితులు అలాగే పిల్లల ఆరోగ్య పరిస్థితుల కారణంగా హాజరు కాలేదని వారికి ఇంక్రిమెంట్లు కట్ చేయాలని భావిస్తున్న అధికారుల వైఖరి సరికాదన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు ఎజాజ్ అహ్మద్, సుబ్బారావు, వీరనారాయణ, విశ్వనాథ్, గంగన్నలు పాల్గొన్నారు.

ఫీజులు అరికట్టడంలో విద్యాశాఖ విఫలం

విద్యార్థి యువజన సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం

కడప (సెవెన్‌రోడ్స్), జూన్ 1: ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో అక్రమంగా వసూలు చేస్తున్న అధిక ఫీజులు అరికట్టడంలో విద్యాశాఖ పూర్తిగా విఫలమైందని విద్యార్థి, యువజన సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కడపలో శనివారం గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమాఖ్య కార్యాలయంలో జీఆర్‌ఎస్‌వైఎఫ్ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం శనివారం నిర్వహించారు. సమావేశం జీఆర్‌ఎస్‌వైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ సిద్ధిక్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జీఆర్‌ఎస్‌వైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీఎం ఓబులేసు యాదవ్, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు బాబు, టీఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఏటూరు లోకేశ్, పీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు దారా గోపి, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీపీ నాగేంద్ర, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సూర్యవంశి, ఆర్‌ఎస్‌వైఎఫ్ జిల్లా కార్యదర్శి పవన్‌కుమార్‌లు మాట్లాడారు. యూనిఫామ్స్, బుక్స్ ఇతర మెటీరియల్స్ విద్యాసంస్థలలోనే అమ్మకానికి పెట్టినా పట్టీపట్టనట్లు విద్యాశాఖ అధికారులు వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. ఈనెల 6న డీఈఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టడం, 8న ఆర్‌ఐవో కార్యాలయం వద్ద ఆందోళన, 10న ఆర్‌జేడీ కార్యాలయం వద్ద ఆందోళన, 12న కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహారదీక్షలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థి యువజన సంఘాల నేతలు సురేంద్ర, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

దొంగ అరెస్టు : 195 గ్రాముల బంగారు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న బంగారు నగలు, నిందితుడు

బద్వేలు రూరల్, జూన్ 1 : మండల పరిధిలోని బయనపల్లెలో గత నెల 26న బసిరెడ్డి వసుంధర అనే మహిళ ఇంట్లో జరిగిన దొంగతనం కేసులో దొంగను అరెస్టు చేసి 195 గ్రాముల బంగారు స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ సీఐ విక్రమసింహ తెలిపారు. శనివారం స్థానిక రూరల్ సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బసిరెడ్డి వసుంధర ఇచ్చిన ఫిర్యాదు మేరకు బయనపల్లెలో ఇంటి ఆరుబయట నిద్రిస్తున్న సమయంలో దిండు కింద ఉన్న ఇంటితాళాలు తీసుకుని దొంగతనానికి పాల్పడినట్లు తెలిపారు. వారుతెలిపిన కొన్ని గుర్తుల మేరకు రూరల్ సీఐ రవికుమార్ సిబ్బందితో ప్రత్యేక టీం ఏర్పాటు చేసి గుమ్మళ్ల వెంకటసుబ్బయ్య అనే దొంగను అరెస్టు చేసి విచారించగా ఈ దొంగతనంలో అనుచరుడు కుమార్ కూడా సాయపడ్డాడని తెలిపాడన్నారు. అయితే కుమార్ పరారీలో ఉన్నట్లు ఆయన తెలిపారు.

నిందితుడు గుమ్మళ్ల వెంకటసుబ్బయ్యపై జిల్లాలోని ఎర్రగుంట్ల, బద్వేలు రూరల్, మైదుకూరు, ప్రొద్దుటూరు రూరల్, కడప టూటౌన్, కోవెలకుంట్ల స్టేషన్ల పరిధిలో ఒక్కొక్క దొంగతనం కేసు బద్వేలు అర్బన్ పోలీసుస్టేషన్ల పరిధిలో నాలుగు దొంగతనం కేసులు ప్రొద్దుటూరు త్రీటౌన్, బద్వేలు రూరల్, అట్లూరు, చిట్వేలి, ఓబులవారిపల్లె, సంబేపల్లె, నందలూరు పోలీసుస్టేషన్లలో ఒక్కొక్క ఎర్రచందనం కేసులు, మైదుకూరులో రెండు ఎర్రచందనం కేసులు నమోదై ఉన్నాయన్నారు. ఇతడిపై గతంలో అట్లూరు పోలీసుస్టేషన్‌లో ఎర్రచందనం కేసులో పీడీ యాక్టుపై జైలుకు పంపగా సుమారు 9 నెలల పాటు కడప సెంట్రల్ జైలులో ఉండి బెయిలుపై విడుదలయ్యాడన్నారు. కేసును ఛేదించిన బద్వేలు రూరల్ సీఐ విక్రమసింహ, ఎస్‌ఐ రవికుమార్, సిబ్బందిని ఎస్పీ అభినందించినట్లు ఆయన తెలిపారు.

రాజంపేటలో వర్ష బీభత్సం

- ఉరుములు, మెరుపులు, గాలులతో కూడిన వర్షం
- నేలకొరిగిన అరటి, బొప్పాయి చెట్లు


ద్విచక్ర వాహనాలపై విరిగిపడ్డ చెట్టు

రాజంపేటటౌన్, జూన్ 1 : రాజంపేట మండల పరిధిలోని శనివారం సాయంత్రం పట్టణంలో తీవ్ర గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది. అరగంటపాటు కురిసిన వర్షం ఎండ తాపంతో బాధపడుతున్న పట్టణవాసులకు ఊరట కలిగించిన విషయం అయినప్పటికీ రైతులకు తీరని విషాదం మిగిల్చింది. ఈదురుగాలులకు అరటి, బొప్పాయి తోటలు నేలకొరిగాయి. పట్టణంలో రోడ్లకు ఇరువైపులా ఉన్నచెట్లు, కొమ్మలు విరిగి రోడ్లపై పడ్డాయి. దీంతో ట్రాఫిక్‌కు ఇబ్బంది ఏర్పడింది. పట్టణంలోని కొత్త బస్టాండు సమీపంలో, ఆర్అండ్‌బీ బంగ్లా వద్ద, నూనెవారిపల్లెలో చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. విరిగిన కొమ్మలు విద్యుత్ తీగలపై పడటంతో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో పట్టణంలో పలు వీధులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. రెండు ద్విచక్ర వాహనాలపై చెట్టు విరిగిపడంతో అవి పాక్షికంగా దెబ్బతిన్నాయి. పోస్టాఫీసు, పోలీస్‌స్టేషన్ సమీపంలో కాలువలలో పూడిక తీయకపోవడంతో ప్రధాన రహదారే కాలువలను తలపించింది. దీంతో రోడ్డుపై పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పట్టణంలోని ఇన్‌ఫ్యాంట్ జీసస్ స్కూల్లో ఉన్న షెడ్డు రేకులు గాలికి ఎగిరి పడ్డాయి. మండల పరిధిలోని పలు గ్రామాలలో అరటి, బొప్పాయి పంటలు నేలకొరిగాయి. ఈ ఏడాది అడపాదడపా కాసిన మామిడి కాయలు కూడా నేలరాలి రైతులు తీవ్రంగా నష్టపోయారు.


పోస్టాఫీసు వద్ద ప్రధాన రహదారిపై పారుతున్న వర్షం నీరు


ఈదురుగాలులకు ఎగిరిపడ్డ రేకులు


రాజంపేటలో రోడ్డుకు అడ్డంగా విరిగిపడ్డ చెట్టు

పటిష్టంగా కౌంటింగ్ ఏర్పాట్లు

- కౌంటింగ్ కోసం అన్ని విధాలా సన్నద్ధం
- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిశోర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, చిత్రంలో ఎస్పీ

రాయచోటి (కలెక్టరేట్), జూన్ 1: కౌంటింగ్‌కు సంబంధించి అన్ని ఏర్పాట్లు పటిష్టంగా పూర్తి చేస్తున్నట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్‌కిశోర్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 4వ తేదీ జరగనున్న ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను ప్రణాళికాబద్ధంగా చేపట్టామని, కౌంటింగ్ కోసం అన్ని విధాలా సన్నద్ధంగా ఉన్నామన్నారు. జిల్లాలో ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలు, ఏడు సెగ్మెంట్లతో ఒక పార్లమెంట్ స్థానం ఉందన్నారు. ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలు, పార్లమెంట్ సెగ్మెంట్లకు రాయచోటి జిల్లా కేంద్రంలో పటిష్టమైన భద్రతతో కౌంటింగ్ నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు. పార్లమెంట్ పరిధిలోకి వచ్చే పుంగనూరు అసెంబ్లీ సెగ్మెంట్ కౌంటింగ్ చిత్తూరు జిల్లాలోనే జరుగుతుందని వివరించారు. కౌంటింగ్ కేంద్రంలో అసెంబ్లీ, పార్లమెంట్ సెగ్మెంట్లకు 12 కౌంటింగ్ కేంద్రాలు, పార్లమెంట్ పోస్టల్ బ్యాలెట్‌కు విడిగా ఒక కౌంటింగ్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

కౌంటింగ్ కేంద్రంలో కమ్యూనికేషన్ రూములు మీడియా ఫెసిలిటేషన్, బారికేడింగ్ ఇంటర్నెట్ సౌకర్యం తదితర ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కౌంటింగ్ సాఫీగా జరిగేందుకు చర్యలు తీసుకున్నామని, పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ మధ్యాహ్నం రెండు గంటలలోపు, మొత్తం ఫలితాల ప్రకటనను రాత్రి 7 గంటలలోపు పూర్తి చేయడానికి కృషి చేస్తున్నట్లు వివరించారు. ఎస్పీ బి.కృష్ణారావు మాట్లాడుతూ కౌంటింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేశామన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రతను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. కౌంటింగ్ నేపథ్యంలో ఎలాంటి అల్లర్లు, సంఘటనలు జరగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. పోలింగ్ తర్వాత కూడా జిల్లాలో మొబైల్ పికెట్స్, మొబైల్ పార్టీలను, నైట్ పెట్రోలింగ్ ఏర్పాటు చేశామని చెప్పారు. గొడవలు చేసే వారిని, రౌడీషీటర్లను గుర్తించి కౌన్సిలింగ్ ఇవ్వడంతో పాటు బైండోవర్ చేశామన్నారు. జిల్లా, రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టుల్లో నిఘా ఉంచామని, జిల్లాలో 144 సెక్షన్ అమలు చేస్తున్నామని, పోలింగ్ ప్రక్రియను ప్రశాంతంగా విజయవంతంగా చేయడానికి పోలీస్ యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. సమావేశంలో డీఆర్‌వో సత్యనారాయణ, ఎన్నికల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్‌లో హింసకు తావివ్వరాదు

ఎన్నికల కౌంటింగ్‌లో ఎలాంటి హింసకు తావివ్వకుండా ప్రశాంత వాతావరణంలో పూర్తి కావాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిశోర్ పోలీసు అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో శాంతిభద్రతల పరిరక్షణపై రిటర్నింగ్ అధికారులు, డీఎస్పీలతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 4వ తేదీ జరిగే ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు ఎంతమందిపై బైండోవర్ కేసులు విధించారు. రౌడీషీటర్లపై ఎలాంటి చర్యలు చేపట్టారు తదితర అంశాలపై డీఎస్పీలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో 144 సెక్షన్ అమలు అవుతోందని, ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. 133 సెక్షన్ కింద రాళ్లు, రప్పలు, కర్రలు లాంటి ఇతరులకు హాని కలిగించేవి ఎవరూ పెట్టుకోకూడదన్నారు. లా అండ్ ఆర్డర్‌ని ఎవరూ చేతుల్లోకి తీసుకోవడానికి వీలు లేదన్నారు. ప్రజాస్వామ్యంలో గెలుపోటములు సహజమని, ప్రజాతీర్పును స్వాగతించాలని, ఈ విషయం ప్రతి ఒక్కరూ గుర్తించి ఎటువంటి గొడవలు జరగకుండా సహకరించాలన్నారు. కార్యక్రమంలో అడిషినల్ ఎస్పీ డాక్టర్ రాజ్‌కమల్, డీఆర్‌వో సత్యనారాయణ, ఆర్‌వోలు, డీఎస్పీలు తదితరులు పాల్గొన్నారు.

విత్తన దుకాణాల ఆకస్మిక తనిఖీ

- రెండు దుకాణాలపై కేసు నమోదు


దుకాణంలో తనిఖీలు చేస్తున్న అధికారులు, సిబ్బంది

ప్రొద్దుటూరు క్రైం, జూన్ 1 : ప్రొద్దుటూరులోని రెండు విత్తనాల దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు చేసి ఆ రెండు దుకాణాలపై కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ ఈదురుబాష తెలిపారు. తనిఖీలో భాగంగా శనివారం స్థానిక మైదుకూరు రోడ్డులోని విత్తనాల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశామన్నారు. భారతి సీడ్ ఏజెన్సీస్, శ్రీవేంకటేశ్వర సీడ్స్ ఏజెన్సీస్‌లో విత్తనాల రికార్డులను పరిశీలించినట్లు ఆయన తెలిపారు. ఈ తనిఖీలలో భాగంగా అన్ని రికార్డులు,నిల్వలకు స్వల్పతేడాలు ఉన్నందున శ్రీభారత్ సీడ్స్ ఏజెన్సీస్‌లో 2256 కేజీలు విలువ రూ3,10,200లు సంబంధించిన వివరాలు రికార్డులలో సక్రమంగా నమోదు లేనందున నోటీసు ఇచ్చామన్నారు. శ్రీవేంకటేశ్వర సీడ్స్ ఏజెన్సీస్‌లో 0.729 కేజీలు చిల్లి నారోలి ఎన్ఎస్264 విలువ రూ.92,200లు గాను దుకాణయజమానికి అమ్మకం నిలుపుదల నోటీసు ఇవ్వడమైందని ఆయన తెలిపారు. ఈ తనిఖీల్లో బాలంగాధర్‌రెడ్డి, అగ్రికల్చర్ అధికారులు శ్రీనివాసులు, మురళీకృష్ణ, సుస్మిత పాల్గొన్నారు.

హోటళ్లలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు



అభిరుచి హోటల్‌లో వ్యర్థాల పక్కన మాంసం ఉన్న దృశ్యం - బృందావన్ హోటల్ వద్ద టేస్టింగ్‌సాల్ట్‌ను చూపిస్తూ మాట్లాడుతున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ హరిత

జమ్మలమడుగు, జూన్ 1: జమ్మలమడుగులోని కొన్ని హోటళ్లు ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నాయని విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో పట్టణంలోని ప్రొద్దుటూరు రోడ్డులో అభిరుచి హోటల్, తాడిపత్రి రోడ్డులోని బృందావన్ హోటల్‌తో పాటు మరికొన్నింటిపై దేవగుడి గ్రామానికి చెందిన రామాజి ఇమ్మానుయేల్ జిల్లాస్థాయి అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో జమ్మలమడుగు ఫుడ్‌ఇన్‌స్పెక్టర్ హరిత ఆధ్వర్యంలో శనివారం ఉదయం 11.30 గంటల నుంచి దాడులు నిర్వహించారు. మొదట అభిరుచి హోటల్‌ను సందర్శించారు. వ్యర్థాల మధ్య మాంసపు ముద్దలు దర్శనమిచ్చాయి. తర్వాత ఫ్రిజ్‌లో స్టాక్ ఉన్న మాంసాన్ని కిందకు దించి చూశారు. మాంసం రెండు నుంచి 4 రోజులు స్టాక్ ఉన్నట్లుగా గుర్తించారు. కాగుతున్న నూనెను తనిఖీ చేశారు. అక్కడ తయారు చేసి ఆహారాలపై మూతలు లేకపోవడంతో ఈగలు దర్శనమిచ్చాయి. వెంటనే ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తినే ఆహారాలపై మూతలు లేవని, ఆవరణంలో అపరిశుభ్రంగా ఉందని, మాంసానికి సంబంధించి ఏరోజుకారోజు బిల్లులు లేకపోవడం తదితర వాటికి సంబంధించి యజమానికి నోటీసు అందజేశారు. అనంతరం బృందావన్ హోటల్‌లో తనిఖీ చేశారు. ఆహారం తయారు చేసే చోట ఈగలు ఎక్కువగా ఉన్నాయి. దానిపక్కనే టేస్టింగ్ సాల్ట్ స్వాధీనం చేసుకున్నారు. నూనె, ఇతర ఆహార పదార్థాలను తనిఖీ చేశారు. మాంసానికి సంబంధించిన బిల్లు కావాలని అడిగారు. ఆ హోటల్ యజమానిలో ఒకరు మాట్లాడుతూ.. దాదాపు 10 సంవత్సరాల నుంచి ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు తమ వద్దకు రాలేదని, ఇంతవరకు తనిఖీలు చేయలేదని చెప్పారు. నిషేధిత టేస్టింగ్‌సాల్ట్ వినియోగించడం వలన ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడినట్లేనని ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. కేసు నమోదు చేస్తామన్నారు. హోటల్ యజమానులతో మాట్లాడి నోటీసు అందించారు. ఆ రెండు హోటళ్లలో తనిఖీలు చేసి అనుమానం వచ్చిన ఆహార పదార్థాలను టెస్టింగ్‌కోసం పంపించామని, 14 రోజుల్లో వాటి ఫలితాలు వచ్చాక చర్యలు తీసుకుంటామని అన్నారు.

ఆక్రమిత భూమి స్వాధీనం


ఫెన్సింగ్‌ను తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

సిద్ధవటం, జూన్ 1 : స్థానిక జగనన్న కాలనీ సమీపంలోని సర్వేనెంబర్ 432-6లో 1.50 ఎకరాల ప్రభుత్వ భూమిని అదే గ్రామానికి చెందిన వ్యక్తి ఆక్రమించుకుని మామిడి మొక్కలు నాటాడు. ఈ విషయంపై స్థానిక ప్రజలు సిద్ధవటం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయడంతో ఆ మొక్కలను వెంటనే తొలగించాలని వీఆర్వో కేశవను ఆదేశించారు. దీంతో వీఆర్వో ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేసిన ముళ్ల కంచెను, మామిడి మొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూమి ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ నౌకరు పాల్గొన్నారు.

అన్నపై తమ్ముడు కత్తితో దాడి

సీకేదిన్నె, జూన్ 1: చింతకొమ్మదిన్నె మండలం జమాల్‌పల్లెకు చెందిన ఇంటి నిర్మాణం విషయంలో గొడవ జరిగింది. ఈ గొడవలో అన్న అక్బర్ ఇంటి నిర్మాణం చేసుకుంటుండగా తమ్ముడు బాషాఖాన్ స్థలం విషయంలో గొడవపడి కత్తితో పొడిచేందుకు ప్రయత్నించగా తప్పించుకునే ప్రయత్నంలో అన్న చేతికి గాయమైనట్లు స్థానికులు తెలిపారు. గాయపడిన అక్బర్‌ను చికిత్స నిమిత్తం హుటాహుటిన రిమ్స్‌కు తరలించి వైద్యం అందిస్తున్నారు.

కువైత్‌లో గోపవరంవాసి మృతి



గోపవరం, జూన్ 1 : గోపవరం మండలంలోని చిన్నగోపవరానికి చెందిన బుర్రి వరదరాజు (40) కువైత్‌లో గుండెపోటుకు గురై శనివారం మృతి చెందాడు. గుండెనొప్పి రావడంతో వైద్యం కోసం ఆసుపత్రికి తరలించారు. వైద్యచికిత్సలు పొందుతూ ఆయన మృతి చెందాడు. కొన్ని సంవత్సరాలుగా వరదరాజు కువైత్‌లోనే ఉంటున్నాడు. మూడు నెలల క్రితం స్వగ్రామానికి వచ్చి మరలా కువైత్‌కు వెళ్లాడు. కాగా మృతుడికి భార్య గంగాదేవి, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

అంజనీ తనయా..ఆదుకోమమ్ము

● వైభవంగా హనుమజ్జయంతి



కమలాపురంలో పూజలందుకుంటున్న ఆంజనేయస్వామి



చెన్నూరులో హనుమంతుని గ్రామోత్సవం



వేంపల్లెలో నగర సంకీర్తన చేస్తున్న భక్తులు



వల్లూరు: ప్రత్యేక అలంకణలో ఆంజనేయుడు

చెన్నూరు, జూన్ 1:'అంజనీ తనయా.. ఆదుకోమమ్ము' అంటూ భక్తులు అంజనేయ స్వామిని వేడుకున్నారు. శనివారం హనుమజ్జయంతిని ఘనంగా నిర్వహించారు. చెన్నూరు బ్రాహ్మణవీధిలోని హనుమాన్ ఆలయం, బుడ్డాయపల్లెలోని అభయాంజనేయస్వామి ఆలయం, చిన్నమాచుపల్లెలోని వీరాంజనేయస్వామి ఆలయాల్లో వేడుకలు ఘనం గా నిర్వహించారు. గ్రామోత్సవం ఘనంగా జరిగింది.

కమలాపురంలో... బ్రాహ్మణవీధిలో వెలసిన పిచ్చాంజనేయ స్వామి దేవాలయంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి, నాయకులు ఎన్నికల్లో విజయం సిద్ధించాలని పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

వేంపల్లెలో... వృషభాచలేశ్వర భక్తమండలి ఆధ్వర్యంలో నగర సంకీర్తన నిర్వహించారు. కవి డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో రామలక్ష్మణ సీతా హనుమంతుని వేషధారణలు ఆకట్టుకున్నారు.పీసీసీ రాష్ట్ర మీడియా చైర్మన్ నర్రెడ్డి తులసిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. చైతన్య హైస్కూల్ కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు.చైర్మన్ కురాకుల వెంకటేశ్, రామ్మోహన్, సత్య, వీరయ్య, రామాంజనేయులు పాల్గొన్నారు.

చక్రాయపేటలో...
వేంకటేశ్వర, రాచరాయ దేవస్థానంలో హనుమజ్జయంతి ఉత్సవాల సందర్భంగా శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ లాయర్ రామాంజనేయరెడ్డి, చక్రపాణిరెడ్డి, రామిరెడ్డిగారి ఓబుల్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డిల ఆధ్వర్యంలో శనివారం గండి క్షేత్రం నుంచి శోభాయాత్ర చేపట్టగా పీసీసీ మీడియా చైర్మన్ తులసిరెడ్డి, గండి ఆలయ సహాయ కమిషనర్ ముకుందరెడ్డి, చైర్మన్ కావలి కృష్ణతేజ, రామానుజన్‌రెడ్డి, చక్రపాణిరెడ్డి, ఎద్దుల చంద్ర, అశోక్, గంగాధర్ యాత్రను ప్రారంభించారు.



చక్రాయపేటలో హనుమాన్ శోభాయాత్ర

పులివెందులలో...



పులివెందుల పట్టణం, గ్రామీణ ప్రాంతాలలో శనివారం హనుమజ్జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని కడప రోడ్డు హనుమాన్ నగర్‌లో వెలసిన కార్యసిద్ధి ఆంజనేయస్వామి, కదిరిరోడ్డు, ముద్దనూరు రోడ్డు, పార్నపల్లె రోడ్డు, తదితర ప్రాంతాలలో ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆకుపూజ, సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, కలశారాధన, విశేష అలంకరణ, ఇరుముడి పూజ, ఇరుముడి చెల్లింపు నిర్వహించారు. సాయంత్రం మేళతాళాల నడుమ స్వామివారి ప్రాకారోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.



కడప నగరంలో...

గాలిదేవర ఆంజనేయ స్వామి దేవాలయంలో కమిటీ ప్రధాన కార్యదర్శి ఈశ్వర్ రెడ్డి, కార్యదర్శి లక్ష్మీనారాయణరెడ్డి, ఉపాధ్యక్షుడు వి.వి. చలపతి సారథ్యంలో గత నెల 30 నుంచి ఈనెల 1వ తేదీ శనివారం వరకు మూడు రోజుల పాటు వేడుకలు శోభాయమానంగా నిర్వహించారు. స్వామివారి దర్శనానికి పలువురు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



చింతకొమ్మదిన్నె మండలం బయనపల్లెలో ఆంజనేయ స్వామికి ప్రత్యేక అలంకరణ

ఏఓ సురేష్ కుమార్‌కు ఏడీఏగా అదనపు బాధ్యతలు

కడప(రూరల్) జూన్ 1 : కడప మండల వ్యవసాయాధికారి సురేష్‌కుమార్‌రెడ్డికి కడప డివిజన్ సహాయ సంచాలకులు(ఏడిఏ)గా ఆదనపు బాధ్యతలను అప్పగించారు. ఇదివరకు ఇక్కడ ఏడిఏగా పనిచేస్తున్న దాది వెంకట సుబ్బారావు మే 31న పదీవిరమణ చెందారు. ఈ మేరకు సురేష్‌కుమార్ రెడ్డి ఏడిఏ బాధ్యతలను శనివారం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 ఖరీఫ్ సీజన్ ప్రారంభమైందన్నారు. ఈ మేరకు రైతులకు ఖరీఫ్ పంటల సాగుకు కావలసిన ఎరువులు, విత్తనాలను ఆయా ఆర్‌బీకేలలో అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. అవసరమైన రైతులు ఎరువులు, విత్తనాలను ఆర్‌బీకెలలో వివరాలను నమోదుచేసి తీసుకెళ్లాలన్నారు. అలాగే మండల వ్యవసాయాధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండి రైతులకు కావలసిన వ్యవసాయ పరిజ్ఞానాన్ని, సూచనలను, సలహాలను అందించాలన్నారు.

రక్తదాన శిబిరం.. విజయవంతం



ఏపీజీబీ ఆధ్వర్యంలో రక్తదానం చేస్తున్న సిబ్బంది

కడప (సెవెన్‌రోడ్స్),జూన్1:ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కడప, ఏపీజీబీ వార్షికోత్సవ సందర్భంగా రక్తదాన శిబిరాన్ని ఏపీజీబీ ప్రధాన కార్యాలయం వద్ద శనివారం నిర్వహించారు.కార్యక్రమాన్ని గ్రామీణ ప్రాంతీయ కార్యాలయం, హెడ్ ఆఫీసు సిబ్బంది చుట్టుపక్కల శాఖల సిబ్బంది పాల్గొన్నారు.
ఈ సందర్భంగా ఏపీజీబీ చైర్మన్ మాట్లాడుతూ ప్రతి సిబ్బంది, ఖాతాదారులు రక్తదానం చేయాలన్నారు. రక్తదానం ప్రాణదానంలాంటిదన్నారు. ఈ కార్యక్రమంలో రీజనల్ మేనేజరు శ్రీనివాస్ పాల్గొన్నారు.

రైతులకు ఎరువులు ఎమ్మార్పీకే అమ్మాలి

● ఏడీఏ నరసింహారెడ్డి



మాట్లాడుతున్న ఏడీఏ నరసింహారెడ్డి

కమలాపురం రూరల్, జూన్ 1 : ప్రతి డీ లరు ఎమ్మార్పీ ధరలకే ఎరువులు విక్రయించాలని ఏడీఏ నరసింహారెడ్డి అన్నారు. శనివారం ఏడీఏ కార్యాలయంలో ఏవో సరస్వతితో కలిసి కమలాపురం వ్యవసాయ డివిజన్ పరిధిలోని వల్లూరు, ఎర్రగుంట్ల, కమలాపురం మండలాల ఎరువులు, విత్తనాల, పురుగుమందుల డీలర్లకు శనివారం డీలర్లకు సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువులు పురుగు మందులు విత్తనాల చట్టంకు లోబడి వ్యాపారం చేయవలసిందిగా డీలర్లకు తెలిపారు. ప్రతి డీలరు యూరియా ఎమ్మార్పీ ధర కంటే ఎక్కువగా అమ్మరాదని తెలిపారు. స్టాకురిజిస్టరు, బిల్ బుక్, స్టాకు బోర్డు అందరూ తప్పనిసరిగా షాపు నందు ఉంచుకోవాలన్నారు. అలాగే స్టాకు రిజిస్టరుకు ఎరువుల నిల్వలకు వ్యత్యాసం లేకుండా చూసుకోవాలన్నారు. పురుగుమందుల డీలర్లకు ప్రభుత్వం ద్వారా అనుమతి పొందిన పురుగుమందులు మాత్రమే అమ్మాలని సూచించా రు. అలాగే నిషేధించబడిన పురుగుమందులు అమ్మరాదని తెలిపారు.

రైతు సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సుశీల

వేముల, జూన్ 1: ఉద్యాన పంటలకు సంబంధించి నిర్వహించే రైతు సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని అరటి పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ టి.సుశీల పేర్కొన్నారు. శనివారం వేల్పుల రైతు భరోసా కేంద్రంలో డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం అరటి పరిశోధనస్థానం ఆధ్వర్యంలో రైతు సదస్సు నిర్వహించారు. శ్రీకృష్ణ దేవరాయ ఉద్యాన కళాశాల విద్యార్థులు మూడు నెలలుగా అరటి పరిశోధన స్థానం ఆధ్వర్యంలో గ్రామీణ ఉద్యాన పని అనుభవ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ప్రధాన శాస్త్రవేత్త తెలిపారు. నూతన పద్ధతులపై ప్రదర్శన ఏర్పాటుచేశారు. రైతులు అడిగిన వివిధ సందేహాలకు శాస్త్రవేత్తలు సమాధానాలు ఇచ్చారు. శాస్త్రవేత్తలు డాక్టర్ బి.నాగేంద్రరెడ్డి, డాక్టర్ సునీల్‌కుమార్, డాక్టర్ రేష్మ, శ్రీకృష్ణదేవరాయ ఉద్యాన కళాశాల ప్రకృతి విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎల్.నాగిరెడ్డి పాల్గొన్నారు.

'ఇంటర్మీడియట్ విద్యను ఖరీదైన సరుకుగా మార్చిన కార్పొరేట్ కళాశాలలు'



ఆర్‌ఐఓకు వినతిపత్రం అందిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

కడప (ఎడ్యుకేషన్), జూన్ 1 : ఇంటర్మీడియట్ విద్యను కార్పొరేట్ కళాశాలలు ఖరీదైన సరుకుగా మార్చాయని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు పేర్కొన్నారు. విద్య వ్యాపారంగా కొనసాగుతున్న ఇటువంటి కళాశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శనివారం ఆర్‌ఐఓ కార్యాలయంలో ఆర్ఐఓకు వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియట్ విద్యను అత్యంత ఖరీదైన వ్యాపార వాణిజ్యకేంద్రంగా కార్పొరేట్ కళాశాలలు మార్చేశాయన్నారు. ఇదే అదనుగా అకాడమీ పేర్లతో అనుమతులు లేకపోయినా విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా, అర్హత కలిగిన లెక్చరర్లను ఏర్పాటు చేయకుండా నిరుద్యోగులను ఆసరాగా చేసుకుని విద్యను వ్యాపారంగా మారుస్తూ నాణ్యత లోపించే విధంగా బోధిస్తున్నారన్నారు. ఇటువంటి కళాశాలలపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని, అలాగే అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు కె.శివశంకర్, శివ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

'ఎగ్జిట్‌పోల్ చూసి ఆవేశపడొద్దు'

చెన్నూరు, జూన్ 1 : దేశ వ్యాప్తంగా ఎన్నికలు ముగిసిన సందర్భంగా ఎగ్జిట్‌పోల్ ఫలితాలను టెలిఫోన్ల ద్వారా చూసిన ప్రజలు ఆవేశానికి లోను కావద్దని, వాస్తవ ఫలితాలు ఈ నెల 4న విడుదలవుతాయని చెన్నూరు సీఐ పార్థసారథి పేర్కొన్నారు. ఎగ్జిట్‌పోల్ ఫలితాలు వస్తున్న నేపథ్యంలో చెన్నూరులో పాత బస్టాండు, కొత్తరోడ్డు ప్రాంతాల్లో తమ సిబ్బందితో తిరిగి ఎవరూ గుంపులుగా ఉండవద్దని ఎగ్జిట్‌పోల్ చూసి ఒకరిపై ఒకరు ఆవేశాలు పెంచుకోవద్దని అన్నారు. ముఖ్యంగా పందేలు కాయడం తగదని సూచించారు. ఎవరో ఒకరే గెలుస్తారు. అందుకోసం అనవసరంగా డబ్బు వృథా చేసుకోవద్దని హెచ్చరించారు. ఫలితాలు ఎలా వచ్చినా అవి వచ్చేంత వరకు ప్రతి ఒక్కరూ సంయమనం పాటించాలని, ఈ రెండు రోజులపాటు ప్రశాంతంగా ఉండాలన్నారు. అలాగే 4న ఫలితాల అనంతరం మండల వ్యాప్తంగా ర్యాలీలు, ఊరేగింపులు నిషేధమని, గుంపులుగా ఉండడం, రెచ్చగొట్టుకోవడంలాంటివి తగదని ఆయన హెచ్చరించారు. ఒకవేళ అలాగే జరిగితే చట్టం తన పని తాను చేసుకుపోతుందన్నారు.

శ్రీశ్రీ వర్ధంతి సందర్భంగా కవితల పోటీ

కడప (సెవెన్‌రోడ్స్), జూన్ 1 : శ్రీశ్రీ వర్ధంతి సందర్భంగా సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో జూన్ 15న కవితల పోటీ నిర్వహిస్తున్నట్లు సాహితీస్రవంతి జిల్లా కన్వీనర్ లెనిన్ ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుమారస్వామి శనివారం ఒక ప్రకటన లో పేర్కొన్నారు. ఈ కవితల పోటీల్లో పాల్గొన్న వారందరికీ బహుమతులు అందిస్తామన్నారు. జూన్ 15న జరిగే శ్రీశ్రీ సాహిత్య సమాలోచన కార్యక్రమంలో పాల్గొని బహుమతులను స్వీకరించాలని కోరారు. ఈ పోటీకి సంబంధించిన వివరాల కోసం సాహితీ స్రవంతి కన్వీనర్ లెనిన్ ప్రసాద్, 9490660424, పిళ్లా కుమారస్వామి 9490122229లకు సంప్రదించాలని కోరారు.

దివ్యాంగులకు నిత్యావసరాల వితరణ



దివ్యాంగులకు నిత్యావసర సరుకులు అందిస్తున్న బీవీ సుబ్బారావు

పులివెందుల, జూన్ 1: హనుమాన్‌జయంతి సందర్భంగా పట్టణంలోని దివ్యాంగులకు నిత్యావసర సరుకులు శనివారం పంపిణీ చేశారు. విశ్రాంత టెలికం డివిజనల్ ఇంజనీర్ బీవి సుబ్బారావు హనుమాన్ జయంతి పర్వదినాన్ని పురస్కరించుకొని స్థానిక దివ్యాంగుల కార్యాలయంలో పలువురికి నిత్యావసరాలు పంపిణీచేశారు. ముదుగా హనుమంతునికి ప్రత్యేక పూజలునిర్వహించారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షులు రఘునాథరెడ్డి, బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు సునీల్‌కుమార్, కార్యవర్గ సభ్యులు శిరీష, నారాయణ, వైభవ్‌రెడ్డి తదితరులుపాల్గొన్నారు.

సీజన్‌కు అగుణంగా అధికారులు స్పందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

కడప (సెవెన్‌రోడ్స్), జూన్ 1:వ్యవసాయ సీజన్‌కు అనుగుణంగా వ్యవసాయ శాఖ అధికారులు స్పందించి రైతులకు సరిపడినన్ని పత్తి, వేరు శనగ, వరి విత్తనాలు ఎరువులు, జీలుగలు మంజూరు చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. శనివారం కడప జిల్లా రైతు సంఘం జిల్లా కార్యాలయం లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వ్యవసాయ పనులు ప్రారంభం కానున్న దృష్ట్యా రైతాంగానికి సబ్సిడీ రూపంలో వేరుశనగ, పత్తి, వరి, జీలుగలు ఆర్‌బీకే కేంద్రాల ద్వారా అవసరమైన వితత్తనాలు వెంటనే అందించేందుకు వ్యవసాయశాఖ అధికారులు దృష్టిసారించాలని కోరారు. రైతులకు పెట్టుబడులకు అవసరమైన విధంగా బ్యాంకులు స్కేలాఫ్ ఫైనాన్స్ ప్రకారం బ్యాంకు రుణాలు రైతులందరికీ అందించాలన్నారు. ముందుగా భూసార పరీక్షలు నిర్వహించి రైతులకు అవగాహన కలిగించి ఏ ఎరువులు వాడాలో అవగాహన కలిగించాలన్నారు. రైతుల మధ్య చిచ్చుపెట్టేవిధంగా ఉన్న భూసర్వేను రద్దు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గోపాలక్రిష్ణయ్య, దస్తగిరిరెడ్డి, జిల్లా కమిటి సభ్యులు శ్రీనివాసులరెడ్డి, వెంకటసుబ్బయ్య, చిన్నసిద్దయ్య, రామచంద్రరెడ్డి, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

బ్రౌన్ గ్రంథాలయానికి పుస్తకాలు బహూకరణ



పుస్తకాలను అందిస్తున్న కన్నయ్యనాయుడు, ఆయన సతీమణి

కడప (ఎడ్యుకేషన్), జూన్ 1 : తిరుపతికి చెందిన ఎస్వీ యూనివర్శిటీ రిటైర్డ్ ఎకనామిక్స్ ప్రొఫెసరు ప్రముఖ కథా నవలా రచయిత డాక్టర్ లంకిపల్లె కన్నయ్యనాయుడు తన భార్య సరస్వతితో కలిసి శనివారం న్యూ బాలాజీ ఖనీలోని తన స్వగృహంలో 500 పుస్తకాలను సీపీ బ్రౌన్ భాష పరిశోధన కేంద్రం సహాయకులు జి.హరిభూషణ్ రావు, సిబ్బంది నీలకంఠేశ్వర్‌రావుకు అందించారు. ఈ సందర్భంగా సంచాలకులు ప్రొఫెసరు తప్పెట రాంప్రసాద్ మాట్లాడుతూ కన్నయ్య బహుకరించిన గ్రంథాల్లో పొదుపు పాట, తొలకరి వానకు తడిచిన గుండె, జీవనం, తొలి సంధ్య, వాంగ్మయ దివాకరుడుతో పాటు ఎన్నో మంచి పుస్తకాలు ఉన్నాయన్నారు.
ఈ పుస్తకాలను బహుకరించిన కన్నయ్యనాయుడును వైవీయు వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్, రిజిస్ట్రారు వైపీ వెంకటసుబ్బయ్య అభినందించారు.

విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలి



మాట్లాడుతున్న ఆర్ఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి

కడప (ఎడ్యుకేషన్), జూన్ 1 : విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలని ఆర్ఎస్‌యు రాష్ట్రఅధ్యక్షుడు రవి శంకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం కడప నగరం ఆర్ఎస్‌యు కార్యాలయంలో ఆయన సమావేశం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ కార్పొరేట్, ప్రైవేటువిద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ర్యాంకులు ప్రకటించుకుంటూ అక్రమ అడ్మిషన్లకు పాల్పడుతూ టక్నో, ఈటెక్నో, ఒలంపియాడ్ పేరుతో విద్యార్థులతల్లిదండ్రుల నుంచి వేలాది రూపాలయలు వసూలు చేస్తున్నారన్నారు. స్థానికంగా ఉన్న అధికారులకు అన్నీ తెలిసినా ఏమీ తెలియనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. ప్రైవేటు కార్పొరేట్ విద్యావ్యవస్థ ఇంతలా బరి తెగించడానికి జిల్లా అధికారులు అవినీతిలో కూరుకుపోవడం వల్ల ఇష్టమొచ్చినట్లు ప్రచారం చేసుకుంటూ విద్యార్థుల తల్లిదండ్రులను మో సం చేస్తున్నారన్నారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించకుంటే దశల వారీగా కార్యాచరణ రూపొందించి ఉద్యమాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. ఆర్ఎస్‌యు నాయకులు చెన్నకేశవరెడ్డి, వంశీ, హరిబాబు, బలరామరాజు, జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ పాల్గొన్నారు.

4 వికెట్లతో నెల్లూరు..
7 పరుగులతో అనంతపురం జట్ల విజయం



113 పరుగులు చేసిన గిరినాథ్‌రెడ్డి.. (అనంతపురం)



100 పరుగులు చేసిన రాజు కుళాయప్ప (అనంతపురం)



135 పరుగులు చేసిన కిరణ్‌షిండే

కడప (స్పోర్ట్స్) జూన్ 1:కడపలో జరుగుతున్న ఏసీఏ సీనియర్ మెన్ ఒన్‌డే ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్ లలో భాగంగా వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో శనివారం చిత్తూరు-నెల్లూరు జట్ల మధ్య జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో 4 వికెట్ల తేడాతో నెల్లూరు జట్టు విజయం సాధించింది. వివరాలివీ.. టాస్ నెగ్గి తొలుత బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 243 పరుగులు చేసి ఆ లౌట్ అయింది. ఇందులో కె.ఎస్.పృథ్వీరాజ్ 67 పరుగులు చేశారు. తదుపరి బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు 41 ఓవర్లలో 6 వికెట్లు మాత్రమే కోల్పోయి వి జయానికి అవసరమైన 244 పరుగులు చేసింది. ఇం దులో నిఖిలేష్ 88 పరుగులు చేసి గెలుపులో కీలకంగా నిలిచారు. అలాగే కెఓఆర్ఎం క్రి కెట్ మైదానంలో అనంతపురం- కర్నూలు జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో తొలుత టాస్ నెగ్గిన అనంతపురం జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 369 పరుగుల భారీ స్కోర్ సాధించింది. ఇందులో గిరినాథ్‌రెడ్డి (బ్యాటర్) 113 పరుగులు (67బంతులలో) చేయగా మరో బ్యాటర్ రాజు కుళాయప్ప సరిగా 100 పరుగులు చేసి జట్టు భారీ స్కోర్‌కు బాటలు వేశారు. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన కర్నూలు జట్టు 49.2 ఓవర్లలో 362 పరుగులు చేసి 7 పరుగుల స్వల్ప స్కోర్‌తో ఓటమిపాలైంది.ఇందులో కిరణ్ షిండే (బ్యాటర్) 135 పరుగులు చేయగా మరో బ్యాటర్ సంజయ్‌నాయుడు 72 పరుగులు చేశారు. దీంతో అనంతపురం జట్టు 7 పరుగుల తేడాతో విజయకేతరం ఎగురవేసింది.

ఎస్పీ ఆధ్వర్యంలో పోలీసు కవాతు



నగరంలో పోలీసు కవాతు చేస్తున్న దృశ్యం

కడప (క్రైం), జూన్ 1 :నగరంలోని ప్రధానకూడళ్లలో శనివారం ఎస్పీ సిద్దార్థ కౌశల్ ఆధ్వర్యంలో పోలీసులు కవాతు నిర్వహించారు. కౌంటింగ్ నేపథ్యంలో ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని సిబ్బందికి ఎస్పీ సూచించారు. భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. 144 సెక్షన్ అమలులో ఉన్న నేపథ్యంలో గుంపులుగా ఎవరూ ఉండరాదన్నారు. ఇప్పటికే పలు ప్రధాన సర్కిళ్ల వద్ద మైకులో పోలీసుశాఖ ప్రకటన చేశారు. సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

రాజశేఖర్‌రెడ్డి సేవలు ప్రశంసనీయం

కడప (ఎడ్యుకేషన్), జూన్ 1 : వైవీయూ ఇంజనీరు రాజశేఖర్‌రెడ్డి సేవలు ప్రశంసనీయమని వైస్‌చాన్సలర్ చింతా సుధాకర్ కొనియాడారు. వైవీయూకు 2022 జూన్ 18న డిప్యుటేషన్‌పై వచ్చిన డీఈ రాజశేఖరెడ్డి తన మాతృ సంస్థ అయిన నీటిపారుదల శాఖకు వెళుతున్న సందర్భంగా వైవీయూ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఆయనను యూనివర్సిటీ ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరు రమణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసులు ఇంకా వైసీపీకి కొమ్ముకాస్తూనే ఉన్నారు

నాయకులను ఊర్లు వదిలిపెట్టి వెళ్లమని చెప్పడం సరికాదు

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు , జూన్ 1 : ఆంధ్రప్రదేశ్‌లో పోలీసులు ఇంకా వైసీపీకి కొమ్ముకాస్తూనే వున్నారని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి ఆరోపించారు. శనివారం టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎలక్షన్ కమిషన్ సీరియస్‌గా తీసుకునే వరకు రాష్ట్రంలో పోలీసులు ఎందుకు ఎన్నికల్లోనూ అనంతరం హింసను అరికట్టలేక పోయారన్నారు. నాయకులను ఊర్లు వదిలి పొమ్మని ఎన్నికల కమిషన్ చెప్పిందా పోలీసులు ఎందుకు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారన్నారు. కేవలం టీడీపీ నాయకులను మాత్రమే ఊర్లు వదిలి పొమ్మని చెబుతున్నారని, వైసీపీ వాళ్ళకు చెప్పడం లేదని ఆరోపించారు. ట్రబుల్ మాంగర్స్ వుంటే వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలని అవసరమనుకుంటే హౌస్ అరెస్టులు చేయాలని లేదనంటే పోలీసు స్టేషన్లో వుంచుకోవాలని ఇలా ఊర్లు వదిలి పెట్టి వెళ్ళమంటే వారు ఎక్కడి వెళ్ళాలన్నారు. అక్కడ ప్రాంతాల్లో కూడా ఇలాంటి నిబంధనలే వుంటాయి కదాఅన్నారు. కొత్తవారు ఎవ్వరూ వుండకూడదని ఆయా ప్రాంతాల్లో పోలీసులు చెబుతున్నారన్నారు. ఎక్కడ లాడ్జీలు బంధువుల ఇళ్ళలో ఎక్కడ తలదాచుకోవాలా డబ్బులు, ఖర్చులు ఎవ్వరు ఇస్తారన్నారు. పోలీసులు ఇలాంటి అనాలోచిత చర్యలు మానుకోవాలని హితవుపలికారు. నాలుగు రోజుల్లో ప్రభుత్వం మారుతుందని తెలిసినా పోలీసులు ఇప్పటికీ న్యాయబద్ధంగా పనిచేయడంలేదన్నారు. స్టేషనుకు వస్తే లంచాలులేనిది పనిచేయడం లేదన్నారు. కొందరు ఎస్ఐలు పెద్ద ఎత్తున లంచాలు మరిగారన్నారు మే 13 నాడు ఎన్నికలలో ప్రొద్దుటూరులో మేం సామరస్య పద్ధతులు అనుసరించామన్నారు. అనవసరంగా పోలీసులే సమస్యలు సృష్టించవద్దన్నారు. చట్టాన్ని పక్కన పెట్టి వైసీపీకి కొమ్ముకాయడం మానుకోవాలన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, హౌసింగ్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కామిశెట్టి బాబు, మండల టీడీపీ నాయకుడు మాడెం సుధాకర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ అమీర్ బాబు పాల్గొన్నారు.

అంధులకు పింఛన్ పంపిణీ



ప్రొద్దుటూరు టౌన్, జూన్ 1: గాజులపల్లె పెద్దసుబ్బయ్య, పెద్దసుబ్బమ్మ సేవా సంస్థ ఆధ్వర్యంలో అంధులకు పింఛను పంపిణీ చేశారు. సోమవారం 52 మంది అంధులకు సంస్థ అధ్యక్షుడు గాజులపల్లె రామచంద్రుడు ఒక్కొక్కరికి రూ.200 వంతున పింఛను అందజేశారు. అలాగే శ్రీరాములు రూ.100, బత్త పెంచలయ్య రూ.100, సాంబశివారెడ్డి రూ.50 వంతున పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గాజులపల్లె రామచంద్రుడు మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో ప్రతినెలా 1వ తేదీనే పింఛను అందజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గురప్ప, గోవిందరాజులు, నరసింహులు, ప్రసాద్, నల్లంశంకర్, ప్రభాకర్‌రెడ్డి, పెంచలయ్య, సుబ్బయ్య, బాష, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా బార్‌అసోసియేషన్ ఎన్నిక

జమ్మలమడుగు, జూన్ 1: జమ్మలమడుగులోని జూనియర్ సివిల్‌జడ్జి కోర్టులో శనివారం బార్‌అసోసియేషన్ నూతన ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. అందులో భాగంగా మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డిని బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బార్ అసోసియేషన్ సెక్రటరీగా కన్నెలూరు గ్రామానికి చెందిన న్యాయవాది కేవీ మురళీధర్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడుగా భూతమాపురం సుబ్బారావు, జాయింట్ సెక్రటరీగా కుండా లోకేష్, ట్రెజరర్ జ్యోతిరాణి, సీనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఎంఎస్.చంద్రశేఖర్‌రెడ్డి, జూనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఎ.నాగార్జునరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ పాలాజీ రవికుమార్, స్పోర్ట్స్ సెక్రటరీ బెల్లం పవన్‌కుమార్, లేడీ రెప్రజెంటీవ్ ఎ.మునీరాబేగంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉద్యోగ విజయోత్సవ వేడుకలు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 1: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు శుక్రవారం ఉద్యోగ విజయోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సోమవారం కళాశాలలో డిప్లమా పూర్తి చేసి వివిధ కంపెనీలలో ఉద్యోగాలకు ఎంపికైన 176 మంది విద్యార్థులకు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన వైఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకులు ప్రొఫెసర్ జయచంద్రారెడ్డి, ప్రొఫెసర్ జయరామిరెడ్డి మాట్లాడుతూ డిప్లమా విద్యార్థులు చిన్న వయస్సులో ఉద్యోగాలకు ఎంపిక కావడం హర్షణీయమన్నారు. కళాశాల ప్రిన్సిపల్ జగదీశ్వరుడు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు.. ఎత్తు పెంచారు



డీఎస్పీ కార్యాలయ ఆవరణలో సుద్దమట్టితో ఎత్తు పెంచిన దృశ్యం

జమ్మలమడుగు, జూన్ 1: జమ్మలమడుగు డీఎస్పీ కార్యాలయం ఆవరణలో కొద్దిపాటి వర్షం వచ్చినా మోకాళ్లలోతు నీళ్లు నిలిచేవి. దీంతో సిబ్బందితో పాటు ఇక్కడికి వచ్చే జనం ఇబ్బందులు పడేవారు. ఈ ఇబ్బందిని గమనించిన ప్రస్తుత డీఎస్పీ వర్షాలు రాకముందే ఆవరణ ఎత్తు పెంచేందుకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా మూడురోజుల నుంచి గండికోట ప్రాంతం నుంచి సుద్దరాళ్లు, మట్టి తరలించి ఎత్తు చేస్తున్నారు. ఈ సంవత్సరం వర్షాకాలంలో డీఎస్పీ కార్యాలయానికి వచ్చే వారికి, ఇక్కడ పనిచేసే వారికి ఇక బురద బాధ ఉండదు.

వైభవంగా హనుమజ్జయంతి వేడుకలు



టూటౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలోని అభయాంజనేయస్వామి ఆలయంలో అరటిపండ్లతోస్వామి వారి అలంకరణ



పోరుమామిళ్ల, ముద్దనూరులో ఆంజనేయస్వామి గుడిలో భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం



కాశినాయన ఉత్సవాల్లో ఏర్పాటుచేసిన కోలాటం



జమ్మలమడుగు బురుజు ఆంజనేయస్వామి ఆలయంలో భక్తుల పూజలు



రాజుపాలెంలో ఒంటెవాహనంపై సంజీవరాయస్వామి

ఎర్రగుంట్ల, జూన్ 1: హనుమత్‌జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని అనేక ఆంజనేయ స్వామి దేవాలయాల్లో స్వామివారికి తెల్లవారుజామునుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకం, అర్చన, హోమాలు నిర్వహించారు. స్వామివారికి వడమాలలు మెడలోవేసి నైవేద్యాలు సమర్పించారు. మధ్యాహ్నం ఆలయాల్లో అన్నప్రసాదాన్ని పంపిణీచేశారు. సాయంత్రం మెరవణి నిర్వహించారు. స్థానిక నడివూరులో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిప్పలూరులో హోమాలు నిర్వహించారు. పెద్దనపాడులో స్వామివారికి వైభవోపేతంగా అలంకరణలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కొండాపురం..: హనుమాన్ జయంతి వేడుకలను గండ్లూరు, చౌటిపల్లె,దత్తాపురం తదితర చోట్ల ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆంజనేయస్వామికి ఇష్టమైన ఆకుపూజతో పాటు అభిషేకాలు నిర్వహించారు.భజన కార్యక్రమం ఏర్పాటు చేశారు.గండ్లూరు,చౌటిపల్లె తదితర చోట్ల అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

ముద్దనూరు..: ముద్దనూరు, చింతకుంట ఆంజనేయస్వామి ఆలయాల్లో శనివారం హనుమత్ జయంతి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు.ముద్దనూరు టౌన్ వరదాంజనేయస్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక ఆకు పూజా కార్యక్రమాలు,రామాలయం భజన బృందం వారిచే భజన కార్యక్రమాలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

పోరుమామిళ్ల..: హనుమాన్ జయంతి వేడుకలు మండలంలో భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. మహిళలు అష్టోత్తర కలశాలతో వేంకటేశ్వరుని దేవాలయం నుంచి రామనామ సంకీర్తనలతో చిన్నారుల కోలాటాలతో మల్లకతవ వద్ద ఉన్న అభయాంజనేయస్వామి దేవస్థానం వరకు కన్నులపండువగా శోభాయాత్ర నిర్వహించారు. మధ్యాహ్నం అచలానంద ఆశ్రమ పీఠాధిపతి గిరిజానందస్వామి ఆధ్యాత్మిక ప్రవచ నాలు వినిపించారు. రాత్రి కులుకు భజన కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే పోరుమామిళ్ల పోలీసుస్టేషన్ ఎదురుగా ఉన్న వీరాంజనేయస్వామి దేవస్థానం, పంచాయతీ కార్యాలయం సమీపంలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో పాలాభిషేకం చేసి ఆంజనేయస్వామి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్య క్రమం నిర్వహించారు. అలాగే రంగసముద్రం పంచాయతీ పరిధిలోని ఆంజనేయస్వామి దేవాలయాలు, రెడ్డినగర్‌లో ఉన్న అభయాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

చాపాడు..: మండలంలోని సీతారామపురం, తిప్పిరెడ్డిపల్లె గ్రామాల వద్ద ఉన్న అభయ ఆంజనేయస్వామి దేవాలయాల్లో హనుమత్‌జయంతి ఉత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. దేవతామూర్తి అయిన శ్రీ ఆంజనేయస్వాములవారికి కుంకుమార్చన, పూల అర్చన, కలశస్థాపన వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తిప్పిరెడ్డిపల్లె గ్రామంలో విద్యార్థులు చెక్కభజన నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

అట్లూరు..: మండలంలోని అట్లూరు, కొండూరు, లింగాలకుంట, ముత్తుకూరులో హనుమంతుని ఆలయాల్లో భక్తులు హనుమాన్ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచేపూజలు నిర్వహించారు.అనంతరం అన్నదానం నిర్వహిం చారు.

మైదుకూరు రూరల్..: మైదుకూరులో హనుమాన్ జయంతి వేడుకలు శనివారం భక్తులు ఘనంగా నిర్వహించారు. మైదుకూరులోని శ్రీలక్ష్మిమాధవరాయస్వామి ఆలయం, శ్రీనగరం, ఆంజనేయనగర్, పాతపాలెం తదితర ఆలయాలలో హనుమాన్ జయంతి వేడులకు ఘనంగా నిర్వహించారు.అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

జమ్మలమడుగు..: జమ్మలమడుగులో శనివారం ఆంజనేయస్వామి (హనుమాన్) జయంతి వేడుకలు వైభవంగా జరిగాయి. పురాతన దేవాలయాలైన జమ్మలమడుగు పట్టణంలోని శ్రీ బురుజు ఆంజనేయస్వామి దేవాలయంలో భక్తులు విశేషంగా పాల్గొని పూజలు చేసి మొక్కుకున్నారు. అలాగే పెద్దపసుపుల మోటు, ఆంజనేయస్వామి గుడివద్ద, మెయిన్‌పోస్టాఫీసు వీధిలో, అంబాభవానీదేవాలయం సమీపంలోని శ్రీరాముని ఆలయం వద్ద తదితర ప్రాంతాల్లో హనుమాన్ జయంతిని పురష్కరించుకుని భక్తులు పూజలు చేశారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లోని దేవగుడి, మోరగుడి, గూడెం చెరువు, గండికోట, పి.బొమ్మేపల్లె, రాజీవ్‌నగర్ కాలనీ, పెద్దదండ్లూరు, పి.సుగుమంచిపల్లె తదితర గ్రామాల్లోని పురాతన ఆలయాల్లో భక్తులు ఆంజనేయస్వామిని దర్శించుకుని పూజలు చేసి మొక్కుకున్నారు. కొన్ని చోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

కాశినాయన..: ఉప్పలూరు గ్రామంలో శనివారం హనుమాన్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆంజనేయ స్వామి గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదానం,మజ్జిగ పంపిణీ చేపట్టారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన కోలాటం,భజనకార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

బద్వేలుటౌన్..: హనుమాన్ జయంతి పర్వదినం సిద్దవటంరోడ్డులోని శ్రీమహాలక్ష్మీగోదాదేవి సహిత శ్రీవేంకటేశ్వరస్వామి అభయాంజనేయస్వామి దేవాలయంలో, ఆంజనేయనగర్‌లో వెలసి ఉన్న అభయాంజనేయస్వామి ఆలయంలో, పోరుమామిళ్లరోడ్డులోని పాతపోస్టాఫీసులో వెలసి ఉన్న వీరాంజనేయస్వామి ఆలయంలో, నాగులచెరువుకట్ట వద్ద వెలసి ఉన్న అభయాంజనేయస్వామి ఆలయంలో, మైదుకూరురోడ్డు కుమ్మరికొట్టాలలో వెలసిఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి విశేషపూజలు నిర్వహించారు. అలాగే భక్తులకు ఆయా ఆలయాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రొద్దుటూరు టౌన్..: హనుమాన్ జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని వివిధ ఆలయాల్లో హనుమత్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాత మార్కెట్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో తెల్లవారుజామున స్వామివారికి పంచామృతాభిషేకం నిర్వహించి గజమాలలు, వడమాలలతో అలంకరించారు. భక్తులు ఆకుపూజ చేసి భక్తిశ్రద్ధలతో మొక్కుకున్నారు. టుటౌన్ సమీపంలోని అభయ ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలోని భారీ ఆంజనేయస్వామి విగ్రహాన్ని అరటిపండ్లతో అలంకరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వినియోగం చేశారు. రామేశ్వరం మోరీల సమీపంలో ఆంజనేయస్వామి మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. పెన్నాతీరంలోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు.

గోపవరం..: మండల పరిధిలోని ఆంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జయంతి సందర్భంగా శనివారం ఘనంగా భక్తులు పూజలు చేశారు. ఆంజనేయుడికి కాయ కర్పూరం చెల్లించి పూజలు చేశారు. ఆకు పూజలు చేసి తమ మొక్కులు తీర్చుకున్నారు.

బ్రహ్మంగారిమఠం..: మండల కేంద్రంలోని వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానం ప్రాంగణంలో ఉన్న ఆంజనేయస్వామికి పాతూరు గ్రామంలో సుగాలితాండ సమీపంలో వెలసి ఉన్న శ్రీఅభయ ఆంజనేయస్వామి, అలాగే పోలేరమ్మ గుడి సమీపంలో వెలసి ఉన్న శ్రీపంచముఖ ఆంజనేయస్వామికి హను మాన్ జయంతి సందర్భంగా శనివారం పూజా కార్యక్రమాలను వైభవంగా చేపట్టారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం శ్రీ పంచముఖ ఆంజనేయస్వామిని గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

రాజుపాలెం..: ప్రముఖ పుణ్యక్షేత్రమైన వెల్లాల చెన్నకేశవ, సంజీవరాయస్వామి ఆలయంలో హనుమత్ జయంతి వేడుకలు శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సంజీవరాయస్వామికి ముందుగా అభిషేకాలు, ఆకుపూజలు తదితర వాటితో పూజలు చేశారు. అనంతరం ఒంటెవాహనంపై సంజీవరాయస్వామిని ప్రత్యేకంగా ఏర్పాటు చేసి గ్రామోత్సవం నిర్వహించారు.

లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు



బద్వేలు రూరల్, జూన్ 1:మున్సిపల్ పరిధిలోని వల్లెర వారిపల్లె గ్రామంలో వెలసిన లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో వైశాఖ మాసం ఆరంభం 4వ చివ రి శనివారం సందర్భంగా స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకం చేశారు. వేకువజామునే ప్రత్యేక అభిషేకం, స్వామి అమ్మవార్లకు అభిషేకం ప్రత్యేక పూజలు చేయడంతో పట్టణ గ్రామీణ ప్రాంత ప్రజలు దర్శించుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేశారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 1: వసంతపేట మున్సిపల్ హైస్కూలులో సమ్మర్ క్యాంప్‌లో భాగంగా విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. శనివారం రామేశ్వరంలోని బాలబాలికల గ్రంథాలయం ఆధ్వర్యంలో చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డ్రాయింగ్ మాస్టర్ సుభాష్, వెంకటకొండయ్య, ఉపాధ్యాయురాలు నిర్మలాజ్యోతి,ఇబ్రహీంసాహెబ్, రెహమాన్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

మెనూప్రకారం భోజనం అందించాలి :ఎంఈవో



మాట్లాడుతున్న ఎంఈవో నిర్మల

కాశినాయన .మే1: మెనూప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈవో నిర్మల పేర్కొన్నారు. శనివారం నర్సాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వంట ఏజెన్సీ సభ్యులకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా భోజనం తయారుచేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరిశుభ్రత తదితర అంశాలపై వారికి సూచనలిచ్చారు. కార్యక్రమంలో భాగంగా వంటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ కే.లక్ష్మీదేవి పలువురు వంట ఏజెన్సీ సభ్యులు పాల్గొన్నారు.

హోంగార్డు ప్రవర్తనపై ఎస్పీకి నివేదిక

ప్రొద్దుటూరు క్రైం, జూన్ 1 : పట్టణంలో హోంగార్డు దురుసు ప్రవర్తనపై డీఎస్పీ మురళీధర్ ఎస్పీకి నివేదిక పంపారు. స్థానికంగా రక్షక్ వాహనం డ్రైవరుగా పనిచేస్తున్న ఓ హోంగార్డు విధులకు సరిగా హాజరుకావడం లేదు. దీంతో ఈ విషయమై ఓ ఎస్ఐ అతన్ని ప్రశ్నించాడు. ఈ క్రమంలో ఎస్ఐపై హోంగార్డు దురుసుగా ప్రవర్తించారు. దీంతో ఎస్ఐ ఈ విషయాన్ని డీఎస్పీ మురళీధర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో అతన్ని తన కార్యాలయానికి పిలిపించి డీఎస్పీ మందలించారు. కాగా హోంగార్డు తాను పెట్టుకున్న క్యాప్ తీసి డీఎస్పీ ఎదుటే నేలకేసి కొట్టే ప్రయత్నం చేశాడు. దీంతో హోంగార్డు క్రమశిక్షణ తప్పడంతో ఎస్పీకి నివేదిక పంపినట్లు డీఎస్పీ మురళీధర్ తెలిపారు.

చంద్రబాబును కలిసిన చెరకూరి రవికుమార్



పోరుమామిళ్ల, జూన్ 1 : నారాచంద్రబాబును పోరుమామిళ్ల మండలంలోని కమ్మవారిపల్లెకు చెందిన టీడీపీ యువ నాయకుడు చెరకూరి రవికుమార్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాదులో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం శాలువాతో సన్మానించారు.

ఆక్రమణకు గురైన వంకలు, వాగులు

- తగ్గిన భూగర్భజలాలు
- పట్టించుకోని అధికారులు



తిప్పిరెడ్డిపల్లె గ్రామం వద్ద చిన్న కాలువగా మారిన వంక

చాపాడు, జూన్ 1: మండలంలోని పలు గ్రామాల వద్ద ఉన్న వంకలు, వాగులు ఆక్రమణకు గురయ్యాయి. ఏ ఒక్క అధికారి కూడా వాటిని గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. గత 30 ఏళ్ల నుంచి వంకలు, వాగులు ఆక్రమణకు గురవుతూనే ఉన్నాయి. అనంతపురం, తిప్పిరెడ్డిపల్లె, చాపాడు, గుంతచీపాడు, సోమాపురం, శ్రీరాములపేట, మొరాయిపల్లె తదితర గ్రామాల వద్ద వంకలను రైతులు పూర్తిగా ఆక్రమించుకున్నారు. సుమారు 30 కి.మీ. పొడవునా ఆక్రమించుకున్నారు. వరి, వేరుశనగ వంటి పంటలను పండిస్తున్నారు. ఒక్కొక్క వంక వెడల్పు సుమారు 30 అడుగులు ఉండేది. ప్రతియేడాది కొంత మేర ఆక్రమించుకుంటూపోవడంతో అవి కుచించుకుపోయాయి. దీంతో కొన్ని చోట్ల నాలుగు అడుగుల వెడల్పుకు చేరాయి. చాపాడు, చానెల్‌ద్వారా, వాగుల ద్వారా పైతట్టు ప్రాంతాల్లో కురిసిన వర్షపునీరు, పంట పొలాల్లోని మిగులు సాగునీరు ఈ వంకల ద్వారా కిందిప్రాంతాలకు వెళుతుంది. ఈ విధంగా పోవడంతో పంటలు దెబ్బతినకుండా దిగుబడి వస్తుంది. వంకల ద్వారా నీరు బయటకు వెళ్లడంతో పంటలు దెబ్బతినవు. ఈ వంకల పరిధిలో సుమారు 12 వేల ఎకరాల భూములున్నాయి. ప్రస్తుతం వంకలు, వాగులు పూర్తిగా కనుమరుగయ్యాయని చెప్పవచ్చు. బ్రిటీష్‌వారి కాలంలో రైతుల భూములకు ప్రత్యేకంగా వంకలు, వాగులు ఉండేవిధంగా ఏర్పాటు చేశారు. రెవెన్యూ రికార్డుల్లో వాటి విస్తీర్ణం పొడవు ఆర్ఎస్ఆర్ పుస్తకంలో ఉన్నాయి. కానీ రెవెన్యూ అధికారులు వంకలు, వాగులను గురించి పట్టించుకోవడం మానుకున్నారు. కొంతమంది రైతులు ఆక్రమణలు ఎక్కువగా చేస్తుండడంతో కొన్ని గ్రామాల వద్ద వంకలు చిన్నకాలువల మాదిరి తయారయ్యాయి. కొన్ని చోట్ల రియల్‌ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించుకున్నారు. వంకల్లో నీరు ప్రవహించేటప్పుడు భూగర్భజలాలు భూమిలోకి పోతాయి. వ్యవసాయ ఫిల్టర్లకు దీంతో సాగునీరు అందుతుంది. వంకలు ఆక్రమణలకు గురికావడంతో నీరు భూమిలోకి పోవడంలేదు. దీంతో ఇతర రైతుల వ్యవసాయ ఫిల్టర్లకు, భూములకు సాగునీరు అందడంలేదు. అందువలన కొంతమంది రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఈ ఆక్రమణలపై తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

● తహసీల్దారు వివరణ

ఈ విషయమై తహసీల్దారు భూషణంను వివరణ అడుగగా ప్రభుత్వానికి చెందిన వంకలు, వాగులు ఆక్రమించుకోవడం తప్పన్నారు. గ్రామస్తులు తమకు ఫిర్యాదు చేస్తే తగిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.